క్లుప్తంగా

సంస్కృతి సంప్రదాయాలు కొనసాగించాలి

దండేపల్లి: నేతకాని కులస్తుల సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ కాపాడుకోవాలని నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేష్ అన్నారు. మండలంలోని తాళ్లపేటలో బుధవారం పొలాల అమావాస్య మూడో రోజు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మట్టితో తయారు చేసిన ఎద్దుల ప్రతిమలతో నేతకాని కులస్తులు, సంఘ నాయకులు ర్యాలీ తీశారు. కార్యక్రమంలో నేతకాని సంఘం నాయకులు రాజమల్లు, యువరాజ్, గురువయ్య, శ్రీనివాస్, శేఖర్, లచ్చన్న, రాజన్న, రాజేందర్, శంకర్, చుక్కయ్య, మల్లేష్, రాంచందర్, శివ, రవితేజ పాల్గొన్నారు.

చిన్నన్న, పెద్దన్నలకు బోనాలు



బోనాలు సమర్పిస్తున్న గ్రామస్తులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామంలో బుధవారం గ్రామస్తులు చిన్నన్న, పెద్దన్నలకు బోనాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఉన్న ఆలయానికి డప్పుసప్పుళ్లతో బోనాలు ఎత్తుకొని వెళ్లారు. బోనాలను సమర్పించి, కోళ్లను బలి ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పంటలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

నస్పూర్: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పంటలు దెబ్బతినకుండా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమ శాఖ అధికారి అనిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటలు దెబ్బతినకుండా మెళుకువలు పాటించాలని సూచించారు. ఆరోగ్యకరమైన వేరు వ్యవస్థ పునరుద్ధరణకు మేజర్, ట్రేస్ ఎలిమింట్స్ వినియోగించాలని పేర్కొన్నారు.

గిరిజన గూడేల పరిశీలన

జన్నారం: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గిరిజన గూడేల్లో గిరిజనులు పడుతున్న ఇబ్బందులను తెలంగాణ రాష్ట్ర జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి బుధవారం పరిశీలించారు. గ్రామాల్లో ప్రజల జీవన స్థితిగతులు, వర్షాలకు వారి యొక్క ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గిరిజన ప్రజలు ఇబ్బందులు పడొద్దని, ఎలాంటి అవసరాలు ఉన్నా తెలియజేయాలని తెలిపారు. మండల నాయకులు తిరుపతిని ఘనంగా శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో జంగం రవి, రాజేశ్వర్, మహేష్, సాయి, వాజిద్, ప్రసాద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న డీఆర్‌డీవో

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో మహిళా శక్తి క్యాంటీన్‌లను ఏర్పాటు చేయడానికి డీఆర్‌డీవో కిషన్ ఎంపీడీవో రాజేశ్వర్‌తో కలిసి స్థల పరిశీలన చేశారు. మహిళా గ్రూపుల ద్వారా ఏర్పాటు చేసే ఈ మహిళా క్యాంటీన్‌ల ఏర్పాటు వలన మహిళలు ఆర్థికంగా బలోపేతమవుతారని తెలిపారు. వారి వెంట ఐకేపీ ఏపీఎం లలితకుమారి, ఈజీఎస్ ఏపీవో రజియా సుల్తానా సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న ఎంఈవో, ట్రస్మా నాయకులు

చెన్నూర్: ఎంఆర్‌ఆర్ గార్డెన్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. చెన్నూర్, భీమారం, జైపూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. వేడుకలకు మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి, ఆల్ఫర్స్ అధినేత నరేందర్‌రెడ్డి, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.రాజేంద్రఫణి, ఎండీ ఫయాజ్, జుల్ఫికర్, కోరాళ్ల శ్యాంసుందర్‌రెడ్డి, ఖాజా ఖంరోద్దీన్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శైలజ, తోటి సిబ్బంది ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో బదిలీ కావడంతో సిబ్బంది బుధవారం స్థానిక కళాశాల ఆవరణలో వారికి ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. డీఐఈవో అంజయ్య బదిలీ అయిన సిబ్బంది విజిత్‌కుమార్, పద్మ, శారదలను శాలువాలతో సన్మానం చేశారు.



మంచిర్యాల పట్టణంలో కాజ్‌వే పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు

- మంచిర్యాల పట్టణం, హాజీపూర్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయం
- భారీ వర్షంతో జనం అతలాకుతలం
- నీట మునిగిన పంట పొలాలు
- ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌తో ఏటా నష్టం
- పునరావాసం కల్పించాలని పడ్తనపల్లి వాసుల డిమాండ్

వర్ష బీభత్సం..!

మంచిర్యాలటౌన్/మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల పట్టణం, హాజీపూర్‌లో బుధవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. దాదాపు గంటన్నరకు పైగా కురిసిన భారీ వర్షంతో జనం నానా అవస్థలు పడ్డారు. మంచిర్యాలలోని రాళ్ల వాగు ఉధృతంగా ప్రవహించడంతో రంగంపేట్‌కు వెళ్లే కాజ్‌వే వరద నీటిలో మునిగింది. దీంతో పవర్‌సిటీ, రంగంపేట్‌కు వెళ్లకుండా పోలీసులు అడ్డుగా బారీకేడ్‌లు ఉంచారు. గోదావరి నదీ వరద ఉధృతి కొంత తగ్గుముఖం పట్టడంతో కాలేజీరోడ్డు గోదావరి ఒడ్డున గల పుష్కరఘాట్ మెట్ల వరకు వరద నీరు ఉంది. రాజీవ్‌నగర్ కాలనీలోని శివారు ప్రాంతం మొత్తం వరద నీటితో నిండుకోగా, అక్కడి నుంచి హైటెక్‌సిటీ కాలనీ వద్ద గల రైల్వే అండర్ బ్రిడ్జి వరకు ఉన్న రోడ్డు మొత్తం వరద నీటిలో మునిగిపోయింది. రైల్వే అండర్ బ్రిడ్జికి ఆనుకొని వరద నీరు పారడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. హమాలీవాడ రైల్వే క్యాబిన్ ఏరియాలోని రోడ్లు మొత్తం వరద నీటితో నిండిపోగా, 17వ వార్డులోని బృందావనం కాలనీ, సీతారామ కాలనీలోని రోడ్లు సైతం వరద నీటిలోతో నిండాయి. పద్మశాలీ కాలనీకి వచ్చిన వరద నీటిని జేసీబీ సాయంతో వార్డు కౌన్సిలర్ మెరుగు మహేశ్వరి ఖాళీ ప్రదేశానికి మళ్లించారు. రాంగనగర్‌లో వరద నీరు ఇళ్లల్లోకి చేరకుండా ఉండేందుకు డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని వార్డు కౌన్సిలర్ కొండ పద్మ ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఎన్టీఆర్‌నగర్ కాలనీ వద్ద, అమరవీరుల స్థూపం వద్ద రాళ్లవాగు ఉధృతిని జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో రాములు, తహసీల్దార్ రఫతుల్లా, వార్డు కౌన్సిలర్లు బదావత్ ప్రకాశ్ నాయక్, సిరికొండ పద్మ పరిశీలించారు. హాజీపూర్ మండలంలోని టీకానపల్లి, గుడిపేట, నంనూర్, పెద్దంపేట గ్రామాల్లో వరి, పత్తి, కూరగాయల తోటలు నీట మునిగాయి. పొలాల్లో ఇసుక, బురద మేటలతో నిండిపోయాయి. వాగులు, వంకలు పోటెత్తడంతో పాటు అలుగుమత్తడి దాటి పోటెత్తాయి. కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ గేట్లు తెరవడంతో పాటు ఇటు ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లు తెరవడంతో మండలంలోని లోతట్టు ప్రాంతాలను అధికారులు పరిశీలించి ప్రజలకు సూచనలు చేశారు. హాజీపూర్ తహశీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే, ఎంపీడీవో మధుసూధన్, నాయబ్ తహసీల్దార్ హరితలు ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్, గిర్దావర్‌లు మంగ, ప్రభులు గ్రామాల్లోని పరిస్థితులను సమీక్షించారు. భారీ వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీటితో పడ్తనపల్లి ఎస్సీ కాలనీ జలమయంగా మారింది. అధికారులు స్పందించి సురక్షితంగా ఎగువ ప్రాంతానికి తరలించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక గ్రామస్తురాలు అంకం మల్లవ్వ ఇంటిపై కప్పు పెంకులు కూలి కిందపడ్డాయి. ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ తమ కాలనీ వాసులకు శాపంగా మారిందని, వర్షాలతో ఇళ్లు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు రెవెన్యూ అధికారులకు తమ గోడును మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. తమ కాలనీ చుట్టూ వాగులు ఉన్నాయని, ప్రభుత్వం పునరావాసం కల్పించే వరకు సురక్షిత ప్రాంతాలకు తరలించి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు తమ ఎస్సీ కాలనీని సందర్శించి పునరావాసం కల్పించేలా కృషి చేసేలా అండగా నిలవాలని కోరారు.



రైల్వే అండర్ బ్రిడ్జిని ఆనుకొని ప్రవహిస్తున్న వరద



గోదావరి నది వద్ద పుష్కరఘాట్ మెట్ల వద్ద...



రాళ్లవాగు ఉధృతిని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, ఆర్డీవో రాములు




పునరావాసం కల్పించాలని వేడుకోలు



గొల్లపల్లిలో నీట మునిగిన వరి పొలాలు



వేంపల్లిలో వరద ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవో, ఎస్సై



దొనబండలో అలుగు ఎత్తిపోస్తున్న వరద



రాజీవ్‌నగర్‌లో వరద నీరు



హమాలీవాడ రైల్వే క్యాబిన్ ఏరియాలో...



సీతారామ కాలనీలో రోడ్డుపై నిలిచిన వరద నీరు

పోచమ్మ చెరువుకు గండి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని హమాలివాడలో గల పోచమ్మ చెరువుకు గండి పడింది. చెరువు మత్తడి కాలువకు పక్కనే ఈ గండి పడడంతో, ప్రస్తుతం చెరువులోని నీరు మత్తడి కాలువ ద్వారా బయటకు వెళ్లిపోతుంది. ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేకున్నా, చెరువులోని నీరు మొత్తంగా వృథాగా బయటకు పోవడంతో పాటు, భారీ వర్షాలు కురిస్తే చెరువు కింది ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉన్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



గండి పడి వృథాగా పోతున్న నీరు

మానవత్వం చాటుకున్న సీఐ

చెన్నూర్‌రూరల్: శాంతి భద్రతల పరిరక్షణతో పాటు మానవత్వాన్ని చాటుకున్నారు చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్. విధి నిర్వహణలో భాగంగా వెళ్తున్న సమయంలో మండలంలోని కిష్టంపేట సమీపంలో ప్రధాన రహదారిపై శునకం మృతి చెంది ఉండటాన్ని చూసి, ఆ కళేబరాన్ని రోడ్డుపై నుంచి స్వయంగా తొలగించి మానవత్వం చాటుకున్నాడు.



శునకం కళేబరం తొలగిస్తున్న సీఐ

దర్జాగా సింగరేణి లీజు భూమి కబ్జా

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో మరో కబ్జా ఘటన వెలుగు చూసింది. బెల్లంపల్లి మండలం బుధాకలాన్ గ్రామ శివారు ప్రాంతంలో ఉన్న సింగరేణి లీజు భూమిని కొందరు కబ్జాకు యత్నించగా, సింగరేణి అధికారులు అక్రమార్కులపై తాళ్ల గురిజాల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా ఆక్రమిత భూ భాగంలో సింగరేణి ఎస్టేట్ అధికారులు హెచ్చరికబోర్డు పాతారు. వివరాల్లోకి వెళితే.. బుధాకలాన్ గ్రామానికి వెళ్లే మార్గంలో ఏళ్ల తరబడిగా కొంత భూభాగం ఖాళీ ఉంటోంది. సర్వే నంబర్ 172పరిధిలోకి వచ్చే ఈ స్థలాన్ని ఆక్రమించి బోరు వేయించి విద్యుత్ సౌకర్యం కల్పించారు. వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఆక్రమిత భూమిలో ఓ బోర్డును ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల ఆ ప్రాంతాన్ని సింగరేణి ఎస్‌అండ్‌పీసీ సిబ్బంది అటు వైపు వెళ్లడంతో కంపెనీ లీజు భూమి దురాక్రమణ జరిగినట్లు గుర్తించారు. వెంటనే ఆ విషయాన్ని మందమర్రి ఏరియా సింగరేణి ఎస్టేట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత నెల 31న కబ్జాకు గురైన స్థలాన్ని ఎస్టేట్ మేనేజర్, సింగరేణి ఎస్‌అండ్‌పీసీ చీఫ్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ పరిశీలించి అన్యాక్రాంతమైన స్థలం సింగరేణి కంపెనీదేనని నిర్ధారణకు వచ్చారు. ఈ మేరకు తాళ్ల గురిజాల పోలీసుస్టేషన్‌లో సింగరేణి అధికారులు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఘటన బెల్లంపల్లిలో చర్చనీయాంశంగా మారింది.



ఆక్రమిత భూమిలో సింగరేణి అధికారులు పాతిన హెచ్చరిక బోర్డు

షార్ట్ సర్క్యూట్‌తో పశువులకొట్టం దగ్ధం

తాండూర్: మండలంలోని అచ్చులాపూర్ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ పశువుల కొట్టం కాలిపోయింది. ఈ ఘటనలో ఓ ఆవు మృతి చెందగా, మరో ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామంలోని బ్రాహ్మణవాడలో మంగళవారం అర్ధరాత్రి సుమారు 2గంటల సమయంలో వల్లూరి రాజేశ్వరశర్మ అనే వ్యక్తికి చెందిన పశువుల కొట్టంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. మంటలు అంటుకొని దట్టమైన పొగ వ్యాపించడంతో కొట్టంలో ఉన్న పశువులు బయటకు వెళ్లగా ఓ ఆవు కొట్టంలో ఉండిపోయి మంటలకు ఆహుతైంది. మరో ఆవు తీవ్రంగా గాయపడింది. పశువుల కొట్టానికి మంటలు వ్యాపించినట్లు గ్రహించి గ్రామస్తులు మంటలు ఆర్పేశారు. బుధవారం రెవెన్యూ సిబ్బంది ఘటనాస్థలిని సందర్శించి పంచనామా నిర్వహించారు.

వేర్వేరు కారణాలతో పశువుల మృతి

కోటపల్లి: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు వేర్వేరు కారణాలతో రెండు ఎడ్లు, ఒక గేదె మృతిచెందాయి. పుల్లగామ గ్రామానికి నర్సింగుల రమేశ్ ఎద్దు వరదలో చిక్కుకొని మృతిచెందగా, సిర్సా గ్రామానికి చెందిన పెద్దింటి పున్నంకు చెందిన ఎద్దు రొయ్యలపల్లి గ్రామానికి సమీపంలో విద్యుత్ తీగలకు తగిలి మృతిచెందింది. కాగా సర్వాయిపేట గ్రామానికి చెందిన ఈర్లకుమార్‌కు చెందిన గేదె గ్రామానికి సమీపంలో విద్యుత్ తీగలకు తాకి మృతిచెందింది. మృతిచెందిన ఎడ్లకు, గేదెకు నష్టపరిహారం ఇవ్వాలని బాధితులు వేడుకున్నారు.

పోషకాహార లోపంతోనే అనారోగ్య సమస్యలు

చెన్నూర్/దండేపల్లి/జైపూర్: పోషకాహార లోపంతోనే అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారాన్ని తీసుకోవాలని చెన్నూర్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ అన్నారు. పోషణ మాసోత్సవాల సందర్భంగా స్థానిక మహాంకాళి వాడ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో పౌష్టికాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.దండేపల్లి మండలంలోని మాకులపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. పోషణ ప్రతిజ్ఞ చేశారు.జైపూర్ మండలంలోని గంగిపల్లి, ఇందారం-4 అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను పురస్కరించుకొని పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో ఆయా అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



దండేపల్లిలో పోషణ మాస ప్రతిజ్ఞ

సంక్షిప్త వార్తలు

చర్యలు తీసుకోవాలి

కోటపల్లి: ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఓ మహిళపై దాడిచేసిన ఆటో డ్రైవర్‌ను కఠినంగా శిక్షించాలని లంబాడ హక్కుల ఐక్యవేదిక కో ఆర్డినేటర్ గుగులోత్ సమ్మయ్య నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ మహిళకి మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వ ఆదుకోవాలని, నిందితుడికి శిక్షపడే వరకు వదిలిపెట్టేది లేదన్నారు. రానున్న రోజుల్లో ఇలాంటి దాడులు జరగకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పుస్తక ప్రదర్శన

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామ కొత్తపల్లిలో 'రూమ్ టు రీడ్' సంస్థ వారి ఆధ్వర్యంలో బుధవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. పుస్తక పఠనంపై శ్రద్ధ పెంచేందుకు, పఠనాశక్తిని కల్గించేందుకు గ్రామాల్లో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు పుస్తకాలపై శ్రద్ధ పెంచుకోవాలని పలు రకాల పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.

జేసీబీతో పూడిక తీత

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పడ్తనపల్లి పునరావాస కాలనీలోని సర్వే నంబర్ 61లో మురికి కాలువ పూర్తిగా నిండి కాలువకు ఎలాంటి అనుసంధానం లేకపోవడంతో కాలువలోని మురికి నీరు ఇళ్లలోకి చేరింది. మండల పార్టీ అధ్యక్షుడు తోట రవి ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే జేసీబీని పంపించి కాలువలోని పూడికను తీయించి, మురికి నీరు ఇళ్లలోకి చేరకుండా చర్యలు చేపట్టారు.

ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు

పాతమంచిర్యాల: వర్షాల నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని వరద ముంపు ప్రాంతాలైన రాంనగర్, బృందావన్ కాలనీ, హమాలీవాడ, గాంధీపార్క్, జన్మభూమినగర్, బైపాస్ రోడ్డులో కాంగ్రెస్ నాయకులు, అధికారులు పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు.

గణేశ్ మండపాల సమాచారం ఇవ్వండి

మంచిర్యాలక్రైం/చెన్నూర్: వినాయక చవితిని పురస్కరించుకొని వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే గణేశ్ మండప నిర్వాహకులు సమాచారం ఇవ్వాలని మంచిర్యాల పట్టణ సీఐ బన్సీలాల్, చెన్నూర్ సీఐ రవీందర్ తెలిపారు. వినాయక మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, 24/7 ఇద్దరు వ్యక్తులు విధిగా ఉండాలని సూచించారు. మద్యం సేవించడం, పేకాట ఆడటం నిషేధించినట్లు తెలిపారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, గొడవలు జరుగకుండా నిర్వహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సమాచారం

శిక్షకుల కోసం దరఖాస్తుల స్వీకరణ

శ్రీరాంపూర్: సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో 2024–25 సంవత్సరానికి సంబంధించి నిర్వహించే వృత్తిశిక్షణ కోర్సులను నేర్పించడానికి శిక్షకులు కావాలని డీజీఎం(పర్సనల్) అరవిందరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్ వంటి కోర్సులు నేర్పించాల్సి ఉందన్నారు. శిక్షకులుగా పనిచేయాల్సిన మహిళలు ఈ నెల 11లోగా జీఎం పర్సనల్ డిపార్టుమెంట్ నందు వారి సర్టిఫికెట్లు తీసుకొచ్చి దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. కంప్యూటర్స్ డీటీపీ కోర్సులు కూడా నేర్పించడానికి ఇన్‌స్ట్రక్టర్లు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. సింగరేణి ఉద్యోగుల కుటుంబాల్లోని డిపెండెంట్లు, భూనిర్వాసితులు మాత్రమే శిక్షణ ఇవ్వడానికి అర్హులన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు గడువు పొడిగింపు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాలలో ఇంగ్లిష్, కామర్స్ టాక్సేషన్, బాటనీ సబ్జెక్టులలో ఒక్కో పోస్టు, జువాలజీ విభాగంలో 2 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో అభ్యర్థులు పీజీలో 55శాతం మార్కులతో పాటు పీహెచ్‌డీ అర్హత కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 6వ తేదీ సాయంత్రం 4గంటల వరకు డిగ్రీ కళాశాలలో విద్యాసంబంధిత, ఇతర ధృవీకరణ పత్రాల జిరాక్స్ ప్రతులతో అందజేయాలని తెలిపారు. అభ్యర్థులకు 9న ఉదయం 10గంటల నుంచి అభ్యర్థులకు డెమో, ఇంటర్వ్యూలు జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగితా వివరాల కోసం 99592 39975 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 5, 6న వివిధ కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ పాండురంగ శర్మ తెలిపారు. బీఎస్సీ(ఎంపీసీ, ఎంఎస్ డీఎస్, ఎంజెడ్ సీ, బీజెడ్ సీ) బీకాం(జనరల్), బీఏ(హెచ్‌ఈపీ), కోర్సుల్లో ఖాళీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు ఆసక్తి కలిగిన విద్యార్థులు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

టీఎంకేడీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా సాగర్



శ్రీరాంపూర్: తెలంగాణ మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం(టీఎంకేడీఎఫ్) రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా శ్రీరాంపూర్‌కు చెందిన జక్కుల సాగర్‌ను నియమించారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, హై కోర్టు అడ్వకేట్ ఎడ్ల రవికుమార్ పటేల్ బుధవారం ఆయన నియామక ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర కమిటీలో చోటు కల్పించినందుకు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాపుల అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

మిషన్ భగీరథ డీఈగా విద్యాసాగర్



చెన్నూర్: చెన్నూర్ మిషన్ భగీరథ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా అనుమాల విద్యాసాగర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. జైపూర్ ఏఈగా విధులు నిర్వహించిన విద్యాసాగర్ పదోన్నతుల పై చెన్నూర్‌కు బదిలీ అయ్యారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన డీఈని మాజీ జడ్పీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, చెన్నూర్, జైపూర్ మండల పంచాయతీ అధికారులు అజ్మత్‌అలీ, శ్రీపతి బాపురావులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

మంచిర్యాలఅర్బన్: హిందూ ఉత్సవ సమితి సమావేశం బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా సంఘ సంచాలకులు బద్రి నారాయణ, చంద్రశేఖర్ శెట్టి, జిల్లా కార్యవహ కృష్ణభాస్కర్, నగర కార్యవహ పర్వతాల నర్సయ్య ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దీపేష్ రేన్వా, ప్రధాన కార్యదర్శిగా కర్ణకంటి రవీందర్ నియమితులయ్యారు.